
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 22.514 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 22.514 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,350
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,779
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,952
నవర (8 గ్రాములు)	రూ.47,616

గరిష్టం/కనిష్టం
32.0 /24.9

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 64 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. సోమవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

డీఎస్సీ పండగ

డీఎడ్, బీఈడీ అభ్యర్థులకు ప్రభుత్వం తీపికబురు

- ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల
- ఆనందం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు
- విద్యార్థులతో కోచింగ్ సెంటర్లు ఫుల్
- పట్టుదలతో సిద్ధమవుతున్న అభ్యర్థులు

నెల్లూరు(టౌన్): ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పోస్టులను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్–2024ను విడుదల చేసింది. టెట్, డీఎస్సీకు సంబంధించి షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో నిరుద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొత్తం 346 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు లెక్కలు తేల్చారు. వీటితోపాటు అదనంగా రాష్ట్రస్థాయిలో పీజీటీ, ప్రిన్సిపల్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో డీఎస్సీ కోచింగ్ కోసం వచ్చిన విద్యార్థులతో ఆయా సెంటర్లు కళకళలాడుతున్నాయి. ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో నిరుద్యోగులు పుస్తకాలు, మెటీరియల్‌తో కుస్తీ పడుతున్నారు.

పోస్టుల భర్తీకి చర్యలు

ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రాతిపదికన ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనుంది. ఉమ్మడి జిల్లాలోని మొత్తం 10 నియోజకవర్గాల్లో 3,464 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ప్రస్తుతం 9 వేల మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మొత్తం 346 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. వీటిలో 104 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు, 140 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 102 ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితోపాటు అదనంగా ఏపీ మోడల్ స్కూల్స్, బీసీ సంక్షేమ, గిరిజన ఆశ్రమ తదితర పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు.

షెడ్యూల్ ప్రకటన

ఉపాధ్యాయ పోస్టులను టెట్, డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. టెట్ నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపు, 18వ తేదీ వరకు దరఖాస్తు ప్రక్రియ, 19న ఆన్‌లైన్ నమూనా పరీక్షను నిర్వహించనున్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండనున్నాయి. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 10న ప్రాథమిక కీ, 13న తుది కీ, 14న ఫలితాలను ప్రకటించనున్నారు. అలాగే డీఎస్సీకి ఈ నెల 12న నోటిఫికేషన్, ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, 22వ తేదీ వరకు దరఖాస్తు ప్రక్రియ, 24న ఆన్‌లైన్ నమూనా పరీక్ష నిర్వహించనున్నారు. మార్చి 5 నుంచి హాల్ టికెట్లు అందుబాటులో ఉంచడం, మార్చి 15 నుంచి 30వ తేదీ వరకు డీఎస్సీ పరీక్ష నిర్వహించనున్నారు. మార్చి 31న ప్రాథమిక కీ, ఏప్రిల్ 2న తుది కీ, 7వ తేదీన ఫలితాలను ప్రకటించనున్నారు.

విద్యార్థులతో కోచింగ్ సెంటర్లకు కళ

రాష్ట్ర ప్రభుత్వం టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో నిరుద్యోగులతో ఆయా కోచింగ్ సెంటర్లు కళకళలాడుతున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి కూడా కోచింగ్ తీసుకునేందుకు నెల్లూరుకు వస్తున్నారు. దీంతో గతంలో ఉన్న కోచింగ్ సెంటర్లతోపాటు కొత్తవి కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గ్రూపు–1, గ్రూపు–2 పరీక్షలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయగా, తాజా టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ కూడా రావడంతో నిరుద్యోగులతోపాటు కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టినప్పటి నుంచి విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. 2,400కు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. అంతేకాకుండా ఎక్కడా విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్న పాఠశాలల నుంచి టీచర్లు తక్కువగా ఉన్న పాఠశాలలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో 500 మందికి పైగా టీచర్లను తాత్కాలికంగా బదిలీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం, స్మార్ట్ టీవీలు, డిజిటల్ బోధన, ట్యాబ్‌ల ద్వారా బైజుస్ కంటెంట్‌తో అత్యుత్తమ బోధన, సీబీఎస్ఈ సిలబస్ తదితర కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. తాజాగా ఎక్కడా ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉండకుండా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు.



డీఎస్సీ కోచింగ్ సెంటర్‌లో తరగతులకు హాజరైన నిరుద్యోగులు

ఉమ్మడి జిల్లాలో..	
మొత్తం పోస్టుల సంఖ్య	346
స్కూల్ అసిస్టెంట్	140
సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు	104
ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు	102

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది. నిరుద్యోగుల కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఈ నోటిఫికేషన్ ద్వారా నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించుకునే అవకాశం కలిగింది.

– పావని, డీఎస్సీ అభ్యర్థి

ఎంతో ఆనందంగా ఉంది



డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. పట్టుదలతో చదివి ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ప్రిపేర్ అవుతున్నాను. టీచర్ ఉద్యోగం సాధించడమే నా అంతిమ లక్ష్యం. నాలాంటి ఎంతో మంది ఉద్యోగం సాధించేందుకు ఇదో మంచి అవకాశం.

– రత్నభారతి, డీఎస్సీ అభ్యర్థి

కోచింగ్ సెంటర్‌లో చేరా



రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తుందని ముందుగానే కోచింగ్ సెంటర్‌లో చేరా. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఉద్యోగం సాధించేందుకు కష్టపడి చదువుతా. ఉద్యోగ సాధనలో పోటీతత్వం బాగా పెరిగింది.

– జ్యోత్స్న, డీఎస్సీ అభ్యర్థి

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ జనరల్ విద్యార్థులకు తొలిరోజు ఆదివారం నిర్వహించిన ప్రాక్టికల్స్ ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 107 సెంటర్లలో ఈ ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్స్ జరిగాయి. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 3,041 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 2,958 మంది హాజరయ్యారు. 83 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 4,203 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 4,074 మంది హాజరయ్యారు. 129 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం రెండు విడతల్లో కలిసి 212 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రేబాలవారివీధిలోకి మార్పు

నెల్లూరు సిటీ: నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సోమవారం నుంచి రేబాలవారివీధికి మారుస్తున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేబాలవారివీధిలోని రేబాల లక్ష్మీనర్సారెడ్డి చిన్నపిల్లల హాస్పిటల్ క్వార్టర్స్‌కు ఈ కార్యాలయాన్ని మార్చినట్లు తెలిపారు. ఇక నుంచి ప్రజలు ఈ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు కొనసాగించవచ్చని తెలిపారు.

చిత్రకారుడు అమీర్‌జాన్‌కు ప్రశంసలు



అమీర్‌జాన్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నెల్లూరుకు చెందిన చిత్రకారుడు షేక్ అమీర్‌జాన్ పెయింటింగ్ గ్రూప్ షోలో ప్రశంసలందుకుంది. ఈ సందర్భంగా అమీర్‌జాన్‌ను ఘనంగా సత్కరించారు. కాన్వాస్‌పై ఆక్రిలిక్ పెయింటింగ్‌తో చిత్రించిన వారణాసి హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి గ్రూప్ షోలో ప్రశంసలు అందుకున్నట్లు అమీర్‌జాన్ ఆదివారం తెలిపారు. ఎందరో ప్రముఖ చిత్రకారుల సమక్షంలో ప్రశంసలందుకోవడం ఆనందంగా ఉందని అమీర్‌జాన్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నాలుగు ప్రాజెక్ట్‌లు



కల్లూరు పాఠశాల విద్యార్థిని వైష్ణవికి ప్రశంసా పత్రం అందజేస్తున్న అధికారులు

దొరవారిసత్రం : శ్రీకాళహస్తిలోని ఆర్‌పీబీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో డీవీ సత్రం మండలం పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన నాలుగు ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ కృష్ణయ్య తెలిపారు. ఇందులో కల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రెండు ప్రాజెక్టులు, శ్రీధనమల్లి, పూలతోట జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ఒక్కొక్క ప్రాజెక్ట్ ఉన్నట్లు తెలిపారు. డీవీ సత్రం నుంచి 14 ప్రాజెక్టులు జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో నిలిచాయి. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

శక్తిస్వరూపిణికి స్వర్ణాభరణాలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి ఆదివారం పట్టణానికి చెందిన ఎంజీ స్వరూప్ దంపతులు రూ.4 లక్షల విలువైన 70 గ్రాముల బంగారు నుదుటి పట్టీ, ముక్కుపుడక తదితర ఆభరణాలను వితరణగా అందించారు. ఆభరణాలను ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించారు. జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యా వ్యవస్థ సమూల ప్రక్షాళన

- ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పాఠశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్ది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన చేయిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మనబడి నాడు–నేడు ఫేజ్–2 కార్యక్రమంలో భాగంగా మనుబోలు మండలం అక్కంపేట గ్రామంలో రూ.1.73 కోట్లతో నిర్మించిన ఎన్‌ఎస్‌ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల భవనాన్ని ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ గతంలో మన పిల్లలు చదివిన ప్రభుత్వ పాఠశాలలు, ప్రస్తుతం రాష్ట్రంలో మనం చూస్తున్న పాఠశాలలు ఎలా ఉన్నాయో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. విద్యా వ్యవస్థను సమూల ప్రక్షాళన చేసి కార్పొరేట్ తరహా విద్యను పేద విద్యార్థులకు చేరువ చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన వసతులు కల్పించడమే కాకుండా పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశంతో అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్ తదితర పథకాలను అమలు చేస్తూ భరోసా కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బ్యాగులు, షూస్, యూనిఫాం, ట్యాబ్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టామన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తోందన్నారు. ఇంటి ముంగిటకే పెన్షన్, రేషన్ అందజేస్తున్నామని, పేదల ఆరోగ్య పరిరక్షణకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తూ అవసరమైన వారికి మందులు కూడా అందజేస్తున్నామని తెలిపారు. అన్ని సచివాలయాల పరిధిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య అవసరాలను తీరుస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఒక్క అక్కంపేట గ్రామంలోనే అభివృద్ధి పనులకు గత ఐదేళ్లలో రూ.6.80 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇళ్ల పట్టాలు, సంక్షేమంతో కలుపుకుని ఈ ఒక్క గ్రామానికే రూ.18 కోట్ల లబ్ధి చేకూర్చిందని తెలిపారు. క్రమబద్ధీకరణలో భాగంగా టీడీపీ హయాంలో మూతపడే దశకు చేరుకున్న పాఠశాలను కాపాడుకోవడమే కాకుండా సొంత నిధులతో అనేక వసతులు సమకూర్చిన మాజీ సర్పంచ్ కిరణ్ అభినందనీయులన్నారు. అంతకుముందు మంత్రి కాకాణి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎస్‌ఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నారపరెడ్డి జాంబవతమ్మ, ఎంపీపీ వజ్రమ్మ, మండల ఉపాధ్యక్షులు వెంకటరమణారెడ్డి, చందన, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసులురెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షబ్బీర్, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మరో మృతుడు కడప వాసి

- అతను చెన్నైలో యూనియన్ బ్యాంక్‌లో మేనేజర్
- కావలిలో దిగి కడపకు వెళ్లాలని..

కావలి : కావలి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన లారీ విధ్వంసంలో భాగంగా ట్రావెల్ బస్సును ఢీకొట్టిన దుర్ఘటనలో గుర్తుతెలియని మృతుడి వివరాలను గుర్తించినట్లు కావలి రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. కడపకు చెందిన రూపేన్ చక్రవర్తి (37) చెన్నైలో యూనియన్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వారాంతం సెలవులు కావడంతో కడపకు వెళ్లడానికి చెన్నై నుంచి కడపకు వెళ్లే రైలు మిస్ అయింది. దీంతో చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న 'వేమూరి కావేరి ట్రావెల్స్' బస్సులో ఎక్కాడు. అతను కావలిలో దిగి కడపకు ఆర్టీసీ బస్సు ఎక్కి వెళ్లాల్సి ఉంది. కాగా 'వేమూరి కావేరి ట్రావెల్స్' బస్సు కావలి సమీపంలో గౌరవరం వద్ద టోల్‌గేట్ వద్దకు రాగానే కావలిలో దిగేందుకు తన సీటులో నుంచి లేచి వచ్చి డ్రైవర్ వద్ద క్యాబిన్‌లో కూర్చొన్నాడు. బస్సు టోల్‌గేట్ దాటిన కొద్ది సెకండ్లలోనే అవతల రోడ్లో ఒక లారీ ముందు వెళ్తున్న గేదెల లారీని ఢీకొట్టి డివైడర్‌ను దాటి ఇటువైపు వస్తున్న 'వేమూరి కావేరి ట్రావెల్స్' బస్సును ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో బస్సు ముందుభాగం నుజ్జునుజ్జు అయి క్యాబిన్‌లో ఉన్న వ్యక్తి మరణించాడు. మొదట అతని వివరాలు తెలియక పోలీసులు లోతుగా విచారణ జరిపారు. దీంతో కడపకు చెందిన చెన్నైలోని బ్యాంక్ ఉద్యోగిగా పనిచేస్తున్న రూపేన్ చక్రవర్తిగా నిర్ధారించుకుని అతని కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. ఆదివారం కుటుంబసభ్యులు మృతదేహాన్ని తమ స్వస్థలానికి తీసుకెళ్లారు.

ఆరోగ్య ఆసరా నగదు దోపిడీకి యత్నం

- జీజీహెచ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ అక్రమాలు
- ఆరోగ్యశ్రీలో ఇన్ పేషెంట్‌గా చూపి 12 మంది పేర్లు నమోదు చేసిన వైనం
- అధికారులు ముందుగా గుర్తించడంతో చెల్లింపుల నిలిపివేత

నెల్లూరు సిటీ: పేదలకు ఆరోగ్య సమస్యలు వచ్చాయంటే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఉందనే ధైర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. ఎంత పెద్ద చికిత్స అయినా ఆరోగ్యశ్రీలో చేయించుకోవచ్చని పేదలకు భరోసా ఇస్తోంది. ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా చికిత్స చేయించుకున్న రోగులు డిశ్చార్జి అయ్యాక వారికి జీవన భృతి కింద ఆరోగ్య ఆసరా పేరుతో ప్రభుత్వం కొంత ఆర్థికసాయం అందజేస్తోంది. అయితే కొందరు అవినీతిపరులు ఆరోగ్యశ్రీ చికిత్సలను తప్పుడు మార్గంలో వినియోగించుకుంటూ అక్రమాలకు తెర లేపుతున్నారు. నెల్లూరులోని జీజీహెచ్‌లో ఓ డేటా ఎంట్రీ ఆపరేటర్ పెరాలసిస్ రోగిని ఇన్ పేషెంట్‌గా నమోదు చేసి ప్రభుత్వం అతనికి అందజేసే రూ.30 వేల ఆర్థికసాయాన్ని దోచుకునేందుకు ప్లాన్ చేసినట్లు తెలిసింది.

ఇలా గుర్తించి..

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పెరాలసిస్‌కు వైద్యం, హార్ట్ సర్జరీ చేయించుకున్న అనంతరం రోగులకు జీవనభృతి కింద ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తోంది. అయితే ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేసేందుకు జీజీహెచ్‌లోని అవుట్ సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ప్రయత్నం చేసినట్లు తెలిసింది. రోగిని జీజీహెచ్‌లో ఇన్ పేషెంట్‌గా అడ్మిట్ చేసినట్లు సృష్టించి అనంతరం ఆర్థికసాయం అందేందుకు తగిన పత్రాలు సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఇన్ పేషెంట్‌గా నమోదు చేసిన వారికి సంబంధించి ఇతర ట్రీట్‌మెంట్లు జరిగినట్లు డేటా లేకపోవడంతో విజయవాడ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులకు అనుమానం వచ్చింది. దీనికి సంబంధించి నెల్లూరు ఆరోగ్యశ్రీ అధికారులను వివరణ కోరారు. అధికారులు విచారించగా డేటా ఎంట్రీ ఆపరేటర్ అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. నాలుగు నెలల నుంచి ఈ విధంగా 12 మంది రోగులను ఇన్ పేషెంట్‌గా చూపినట్లు తెలిసింది. అయితే అధికారులు ముందుగా గుర్తించడంతో అక్రమాలు జరగకుండా నియంత్రించగలిగారు.

15 రోజుల క్రితం నోటీసులు ఇచ్చాం

ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా రోగులకు అందించే ఆరోగ్య ఆసరాకు సంబంధించి అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించాం. ఇందుకు సంబంధించి డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్ధా నాయక్‌కు నోటీసులు ఇచ్చాం.

– చంద్రశేఖర్, జిల్లా కోఆర్డినేటర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్, నెల్లూరు

మాఘ మాసం వచ్చేసిందోచ్

- రేపటి నుంచి శుభ ఘడియలు
- కల్యాణ మండపాలకు గిరాకీ
- ఊపందుకున్న అనుబంధ వ్యాపారాలు
- షాపింగ్ మాల్స్‌లో ఫుల్ బిజీ





పూల అలంకరణతో వివాహ మండపం

ఉదయగిరి: మనిషి జీవితంలో వచ్చే అపురూప ఘట్టాల్లో వివాహం అతి ముఖ్యమైనది. వివాహ ప్రక్రియలో శుభ గడియలదే కీలకపాత్ర. మాఘ మాసం ప్రారంభమై ఈ నెల 13వ తేదీ నుంచి శుభ ముహూర్తాలు ఆరంభమవుతున్న నేపథ్యంలో కల్యాణ మండపాలు, వేదపండితులు, శుభకార్యాలకు సంబంధించిన అనుబంధ వ్యాపారాలకు గిరాకీ పెరిగింది. సాధారణంగా పల్లెల్లో తమ ఇంటి ముంగిటే వివాహ వేదికలు ఏర్పాటు చేసుకుంటుంటారు. కానీ పట్టణ ప్రాంతాల్లో అధికశాతం మంది కల్యాణ మండపాల్లో వివాహం చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటారు. దీంతో నెల రోజుల క్రితమే మండపాల బుకింగ్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో శుభకార్యాలకు అనుబంధమైన భజంత్రీలు, పూల అలంకరణలు, పూల దండలు, లైటింగ్, మైక్‌సెట్, బంగారం, వస్త్ర దుకాణాల వద్ద హడావుడి పెరిగింది. స్థితిమంతుల వివాహ వేడుకల్లో సంగీత్ లాంటి కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తుంటారు. భోజనాల మెనూ విషయంలో కూడా ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకుసాగుతుంటారు. మాఘ మాసం ప్రారంభమైన ఈ నేపథ్యంలో శుభకార్యాలు, వివాహాలు నిర్వహించుకునే వారు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మాఘం, పాల్గుణ మాసాల్లో ఫిబ్రవరి 13 నుంచి ఏప్రిల్ 28వ తేదీ వరకు శుభ ముహూర్తాలు ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు. ఈ నెలలో 13, 14, 24, 25, 29 తేదీల్లో, మార్చి నెలలో 2, 17, 22, 24, 27, 28, 30 తేదీల్లో, ఏప్రిల్ 3, 4 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు.

జోరుగా ఏర్పాట్లు

ఈ రోజుల్లో వివాహం అంటే ముందుగా వారి స్థాయికి తగినట్లు కల్యాణ మండపాలు బుక్ చేసుకుంటున్నారు. ఇళ్ల వద్ద స్థలాభావంతో ఎక్కువ మంది కల్యాణ మండపాలపై ఆధారపడుతున్నారు. స్థాయిని బట్టి ఒక్కొక్క కల్యాణ మండపానికి రోజుకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. భజంత్రీలకు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకుంటున్నారు. ఇక పూల అలంకరణ, లైటింగ్ భోజనాలు, ఫొటోలు, వీడియోలు స్థాయికి తగినట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో వివాహానికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

13 నుంచి వివాహ ముహూర్తాలు



ఈ నెల 13వ తేదీ నుంచి వివాహ ముహూర్తాలు ఉన్నాయి. మాఘం, పాల్గుణం, చైత్ర మాసాల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. మే 1వ తేదీ నుంచి మౌఢ్యమి(మూఢమి) మొదలవుతుంది. మరలా శ్రావణ మాసం వరకు శుభ ఘడియలు లేవు. దీంతో ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఎక్కువ శుభకార్యాలు జరగనున్నాయి.

– శంకర్, పురోహితుడు, వింజమూరు

భక్తిశ్రద్ధలతో అగ్నిప్రవేశ మహోత్సవం



నిప్పుల గుండం ప్రవేశం చేస్తున్న భక్తుడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి అమ్మవారి అగ్నిప్రవేశ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ప్రధానార్చకులు, శ్రీపీఠం గురువులు లలితా శివకుమార్‌స్వామి, వినయ్‌స్వామి ఆధ్వర్యంలో పవిత్ర పినాకిని నది తీరంలో గంగాదేవి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. నదీ జలాలను అమ్మవారి సన్నిధికి ఉత్సవంగా తీసుకువచ్చారు. శాస్త్రోక్తంగా పూజలు, హోమాలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, కలశకుంభ సంప్రోక్షణ, రక్షధారణ, సాయంత్రం కన్యపూజ, సువాసినిపూజ తదితర పూజాదికాలు విశేషంగా నిర్వహించారు. భక్తులు నిప్పులగుండ ప్రవేశం చేశారు. అలాగే అమ్మవారితో అగ్నిప్రవేశం చేసిన 102 మంది గోత్రీకుల వంశీకులు పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో నుడా చైర్మన్, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరాం వెంకటసురేష్, కార్యదర్శి, సోమిశెట్టి రమేష్‌బాబు, కోశాధికారి వొమ్మిన ఈశ్వర మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు పేర్ల జనార్దన్‌రావు, సహాయ కోశాధికారి కోట రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా..

అక్రమార్కులు రైళ్లలో అక్రమ రవాణాకు తెరలేపారు. బంగారు, వెండి ఆభరణాలు, గంజాయి, నగదు తదితరాలను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ వ్యవహారం ఎన్నికల తనిఖీల నేపథ్యంలో వెలుగులోకి వచ్చింది. రోజుల వ్యవధిలోనే నగదు, బంగారు, వెండి ఆభరణాలను రైల్వే పోలీసు అధికారులు పట్టుకున్నారు. ఇదే తరహాలో నిత్యం తనిఖీలు కొనసాగితే అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

- ఎన్నికల నేపథ్యంలో రైళ్లలో ముమ్మరంగా తనిఖీలు
- పెద్దఎత్తున బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం
- అక్రమార్కులపై ప్రత్యేక నిఘా


స్వాధీనం చేసుకున్న బంగారు, నగదుతో రైల్వే పోలీసు అధికారులు (ఫైల్)



నెల్లూరు రైల్వే స్టేషన్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రైల్వే పోలీసు సబ్ డివిజన్ పరిధి చీరాల నుంచి తడ, వెంకటగిరి వరకు ఉంది. సుమారు 400 కి.మీ మేర రైలు మార్గం విస్తరించి ఉంది. రోడ్డు మార్గాన నిత్యం ఎక్కడో ఒక చోట తనిఖీలు జరుగుతూ ఉండటంతో కొందరు రైళ్లను అక్రమ రవాణాకు సులువైన మార్గాలుగా ఎంచుకున్నారు. ఒడిశా నుంచి గంజాయిని బెంగళూరు, చెన్నై, కేరళ తదితర రాష్ట్రాలకు చేరవేస్తున్నారు.

బంగారు వ్యాపారులు అక్రమ మార్గాన చెన్నై, తిరుపతి, కోయంబత్తూరు తదితర ప్రాంతాల నుంచి రూ.కోట్ల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను తీసుకొస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ఇక నగదు సంగతి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండానే రూ.కోట్లను వ్యాపారులు తీసుకెళ్తున్నారు. వెంటాడుతున్న సిబ్బంది కొరతతో రైళ్లలో తనిఖీలు అంతంతమాత్రంగానే మారడం అక్రమార్కులకు కలిసొచ్చింది. రైల్వే పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నా అక్రమ రవాణా ఆగడం లేదు.

ఇప్పుడు ఏమి చేస్తున్నారంటే..

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. దీంతో మద్యం, నగదు, ప్రభుత్వ ఖాజానాకు గండి కొడుతున్న బంగారు అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలని గుంతకల్ రైల్వే ఎస్పీ కె.చౌడేశ్వరి పోలీసు అధికారులను ఆదేశించారు. దీంతో నెల్లూరు రైల్వే డీఎస్పీ సి.విజయభాస్కర్ ఆధ్వర్యంలో నెల్లూరు, ఒంగోలు రైల్వే సీఐలు భుజంగరావు, శ్రీకాంత్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ధ్రువీకరణ లేకుండా పట్టుబడిన నగదు, బంగారు, వెండి ఆభరణాలను తదుపరి దర్యాప్తు నిమిత్తం ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పజెబుతున్నారు. రైల్వే పోలీసుల తనిఖీలు అక్రమార్కులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. వారికి చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం లేకపోవడంతో బెంబేలెత్తుతున్నారు.

నిత్యం చేస్తే..

కేవలం 15 రోజుల వ్యవధిలోనే రూ.కోట్ల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, పెద్ద ఎత్తున నగదును అధికారులు పట్టుకున్నారు. ఇదే తరహాలో నిత్యం తనిఖీలు చేస్తే అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు (ఫైల్)

ఈ మధ్య కాలంలో..

- గత నెలలో చీరాల రైల్వే పోలీసులు ఎలాంటి బిల్లులు లేకుండా రూ.10.71 లక్షల నగదు తీసుకెళ్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నగదును సీజ్ చేసి అనంతరం ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించారు.
- గత నెలలో ఒంగోలు రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా ఉన్న రూ.4 లక్షల నగదును సీజ్ చేశారు.
- చెన్నై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు సీఐ ఆధ్వర్యంలో రైల్వే పోలీసులు తనిఖీలు చేశారు. ఓ వ్యక్తి బంగారు ఆభరణాల కోసం ఎలాంటి బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న రూ.26.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.
- గత నెలలో నెల్లూరు రైల్వే సీఐ ఆధ్వర్యంలో గూడూరు ఎస్సై తన సిబ్బందితో కలిసి శబరి ఎక్స్‌ప్రెస్ రైల్లో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. బిల్లులు లేకుండా తరలిస్తున్న 2.85 కేజీల బంగారు ఆభరణాలు, రూ.10,32,520 నగదును సీజ్ చేసి ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించారు.
- ఈనెల మూడో తేదీన చీరాల రైల్వేస్టేషన్‌లో శబరి ఎక్స్‌ప్రెస్‌లో తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని సుమారు 17 కేజీల వెండి ఆభరణాలు, రూ.3.25 లక్షల నగదును సీజ్ చేశారు.
- నాలుగు రోజుల క్రితం ఓ ప్రముఖ జ్యువెలరీ షాపునకు చెందిన వ్యక్తి వద్ద కేజీల్లో వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వాటికి సరైన పత్రాలు ఉండటంతో తిరిగి షాపునకు చెందిన వ్యక్తికే అప్పగించారు.
- ఒంగోలులో గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు.
- మూడు రోజుల క్రితం నెల్లూరు రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి వద్ద తెలంగాణ రాష్ట్రానికి చెందిన 16 మద్యం బాటిళ్లను సీజ్ చేసి నిందితుడిపై చర్యలు తీసుకున్నారు.
- తాజాగా పినాకినీ ఎక్స్‌ప్రెస్‌లో గూడూరుకు చెందిన నిమ్మకాయల వ్యాపారి వద్ద లెక్కాపత్రం లేని రూ.33 లక్షల నగదును స్వాధీనం చేసుకుని గురువారం ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించారు.


స్వాధీనం చేసుకున్న వెండి ఆభరణాలతో రైల్వే పోలీసు అధికారులు (ఫైల్)

నాడు తిట్టి.. నేడు పొత్తు కోసం కాళ్లబేరం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వడం చంద్రబాబుకు ఇష్టం లేదు
- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు: 'తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ఒకప్పుడు దేశ ప్రధాని నరేంద్రమోదీని వ్యక్తిగతంగా తిట్టాడు. అమిత్‌షా తిరుపతికి వస్తే రాళ్లు వేయించిన ఘనుడు. అయితే నేడు పొత్తుల కోసం కమలం పెద్దలతో కాళ్లబేరానికి దిగడం సిగ్గుచేటు' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. రూ.5.51 కోట్లతో మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ఆదివారం వావిళ్ల గ్రామంలో ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు భారతరత్న రావడం ఆయన అల్లుడైన చంద్రబాబుకు ఏ మాత్రం ఇష్టం లేదన్నారు. బాబు గతంలో కేంద్రంలో భాగస్వామిగా ఉండి కూడా ఎన్టీఆర్‌కు దేశ అత్యున్నత పురస్కారం ఇప్పించలేకపోయాడన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎన్టీఆర్ మాత్రమే ప్రజా నాయకులుగా పేరు తెచ్చుకున్నారని చెప్పారు. తెలుగుదేశం మెంబర్‌షిప్ బుక్‌లో ఎన్టీఆర్ పేరును తొలగించిన వ్యక్తి చంద్రబాబని గుర్తుచేశారు. నమ్మి కూతురినిచ్చి పెళ్లి చేస్తే మామకే వెన్నుపోటు పొడిచాడన్నారు. బాబుకు ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేక జనసేనతో పొత్తు పెట్టుకుని, బీజేపీతో కలిసేందుకు ఢిల్లీకి వెళ్లి అమిత్ షా, జేపీ నడ్డాను ప్రాధేయపడ్డాడన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకుని ముఖ్యమంత్రి కావడమే ఆయన లక్ష్యమన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చిన తర్వాతే బీజేపీతో పొత్తులకు వెళ్లాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జనం బ్రహ్మరథం పడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆయన గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ చైర్మన్ దొడ్డం నిరంజన్‌బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఆవుల శ్రీనివాసులు, కాయల సౌందర్య, నాయకులు కొండూరు వెంకటసుబ్బారెడ్డి, పెనుబోలు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్నానదిలో మృతదేహం

కోవూరు: మండలంలోని పోతిరెడ్డిపాళెం సమీపంలో పెన్నానదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి జేబులో కళ్లద్దాల బాక్స్ ఉంది. దానిపై తెలంగాణ కంటి వెలుగు అని రాసుంది. ఇంకా చొక్కా కాలర్‌పై ఉన్న లేబుల్ ఆధారంగా మృతుడిని తెలంగాణ రాష్ట్రం తాండూరు చెందిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. జొన్నవాడ కామాక్షమ్మ గుడికి వచ్చి ప్రమాదవశాత్తు పెన్నానదిలో పడి చనిపోయి ఉంటాడని, నీటి ప్రవాహానికి మృతదేహం కొట్టుకొచ్చిందని అనుమానిస్తున్నారు. చనిపోయిన వ్యక్తికి వయసు 35 నుంచి 40 ఉంటుందని చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ వెల్లడించారు.

క్లుప్తంగా

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

- రూ.6.50 లక్షల సొత్తు రికవరీ


మాట్లాడుతున్న రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

నెల్లూరు రూరల్: తాళం వేసిన ఇళ్లు, దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను నెల్లూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.6.50 లక్షల విలువైన 25 సవర్ల బంగారం, మోటార్‌బైక్ ఒకటి, రూ.10 వేలు రికవరీ చేసినట్లు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి తెలిపారు. నెల్లూరులోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పడారుపల్లికి చెందిన షేక్ గౌస్‌బాషా, నెల్లూరు రూరల్ మండలంలోని నారాయణరెడ్డిపేటకు చెందిన లింగుబేరి రాంబాబు, కావలికి చెందిన నడింపల్లి గోపీ జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్నారు. వారిపై వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయి. రూరల్ మండలం ధనలక్ష్మీపురం సమీపంలోని సామంతులవారితోట ప్రాంతంలో ఉంటున్న బుండి శ్రీహరి కుటుంబం గత నెల 27వ తేదీన నెల్లూరుకు వెళ్లి వచ్చేలోపు నిందితులు 12 సవర్ల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాలతో రూరల్ డీఎస్పీ పర్యవేక్షణలో రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసును ఛేదించిన రూరల్ సీఐ పి.సుబ్బారావు, ఎస్సై స్వప్న, ఐడీ పార్టీ ఏఎస్సై గిరిధర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, సిబ్బంది సతీష్, ప్రసాద్, ఆదినారాయణ, అల్లాభక్షు, మునికృష్ణ, శ్రీనివాసులును ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించారు.

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రికెట్ పోటీలు


ట్రోఫీ అందజేస్తున్న ఎస్ఈ

వెంకటగిరిరూరల్: పట్టణంలోని తారకరామా క్రీడా ప్రాంగణంలో విద్యుత్ ఉద్యోగుల క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం హోరాహోరీగా సాగింది. ఇందులో ఏపీ ఈపీడీసీఎల్ రాజమండ్రి జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో ఎన్‌టీటీపీఎస్ విజయవాడ జట్టు నిలిచింది. వారికి ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ శేషారెడ్డి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనరల్ స్పోర్ట్స్ కౌన్సిలర్ సెక్రటరీ బలరామమూర్తి, బి.సురేష్, కె.రామాంజనేయులు, డీఈఈ ముని రవిచంద్ర, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజల్ని మోసం చేయడమే టీడీపీకి తెలుసు

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


ఆస్పత్రి నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'ప్రజలను మోసం చేయడమే తెలుగుదేశానికి తెలుసు. 2014 ఎన్నికల సందర్భంగా చంద్రబాబు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక నెరవేర్చలేదు. మళ్లీ ఎన్నికలు వస్తున్నాయని కొత్త హామీలతో వస్తున్నాడు. ఆయన్ను ఎవరూ నమ్మొద్దు' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం కావలిలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నూతన భవనాల ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అప్పట్లో బాబు ఇంటికో ఉద్యోగం అన్నాడు.. ఇచ్చాడా అంటే లేదు. పొదుపు రుణాలు మాఫీ చేస్తానని మహిళలను మోసం చేశాడని విమర్శించారు. ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతంలో తిరుపతికి వచ్చినప్పుడు అలిపిరి వద్ద ఆయన కాన్వాయ్‌పై రాళ్లు వేయించిన ఘనుడు చంద్రబాబేనన్నారు. నేడు సీఎం పదవి కోసం ఆయన దిగజారినట్లు చెప్పారు. టీడీపీ నాయకులు జనంలో విశ్వసనీయత కోల్పోయారని, అందువల్లే ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని మోసపూరిత రాజకీయాలు చేస్తున్నారన్నారు. అధికారం కోసం బాబు ఎన్ని కుట్రలైనా చేస్తాడని చెప్పారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్ట అని, అలాంటి వ్యక్తి వల్ల ప్రజలకు ఉపయోగం లేదన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని టీడీపీ అధినేత ఢిల్లీ వెళ్లి పొత్తు కోసం ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. గంటసేపు ఢిల్లీలో తమ నేతలకు కనిపించకుండా ఎవరినో కలిశారన్నారు. ఫేక్ సర్వేను బయటకు తెచ్చారన్నారు. ఇలాంటి వ్యవహారాలు చేయడంలో చంద్రబాబు దిట్ట అని, ఎన్నికలు వస్తుండటంతో రకరకాల వేషాలు వేస్తున్నాడని తెలిపారు. గెలుస్తానని నమ్మకం లేకనే అడిగినన్ని సీట్లు బీజేపీకి ఇచ్చేందుకు ఆయన సిద్ధపడ్డారన్నారు. కేసుల నుంచి తప్పించుకోవడానికి చంద్రబాబు కమలం పార్టీతో కలిసేందుకు ప్రయత్నిస్తున్నాడని చెప్పారు. ఈ ఎన్నికలతో టీడీపీకి ఎండ్ కార్డు పడుతుందని ఎమ్మెల్యే అన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు

జలదంకి: మండలంలోని చామదల పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి చెందిన పులి ప్రభాకర్, చింతం శేషారెడ్డి, అనుచరులు ఆదివారం వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. చామదల సర్పంచ్ పలుకూరి సీతారామమ్మ భర్త రవిచంద్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని రాజగోపాల్‌రెడ్డి పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, చామదల వైఎస్సార్‌సీపీ నాయకుడు వంటేరు పెద లక్ష్మీనరసారెడ్డి, కమ్మవారిపాళెం సర్పంచ్ తమ్మినేని సతీష్‌నాయుడు, ఎంపీటీసీ దేవరపల్లి విజయ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రీన్‌హోం వన్ వరల్డ్ ఫేజ్–2 ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

నెల్లూరు(వేదాయపాళెం): నగర సమీపంలోని చెముడుగుంట జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన గ్రీమ్‌హోం వన్ వరల్డ్ గ్రేటెడ్ కమ్యూనిటీ ఫేజ్–2ను వెంచర్‌ను ఆ సంస్థ ఎండీ బొల్లినేని హజరత్‌బాబు ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఇప్పటి వరకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ప్రాంతాల్లో అనేక వెంచర్లు, గ్రేడెడ్ కమ్యూనిటీల్లో విల్లాలు, ఓపెన్ ప్లాట్లు విక్రయించినట్లు తెలిపారు. నెల్లూరులో వన్ గ్రీన్‌హోం వన్ వరల్డ్ ఫేజ్–2 ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పూర్తి అనుమతులు తీసుకోవడంతోపాటు మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. సీసీ రోడ్లు, భూగర్భ డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు, పార్కులు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. తమ వద్ద ప్లాట్లు కొనుగోలు చేసే కస్టమర్లకు బ్యాంకు రుణ సదుపాయం, స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రీన్‌హోం డైరెక్టర్లు బొల్లినేని హరిబాబు, బీవీ సాయిరాం, ఆనంద్, మార్కెటింగ్ డైరెక్టర్ బీవీ రామారావు, రాచాల రవికుమార్ యాదవ్, పుల్లయ్య, దానియల్ రాజు, రుషికేష్, శేఖర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

నాయుడుపేటటౌన్: మండలంలోని విన్నమాల సమీపంలో శనివారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు ఆగి ఉన్న లారీని ఢీకొంది. దీంతో బస్సు డ్రైవర్‌తోపాటు ఎనిమిది మంది ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. ఏలూరు డిపో ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి విజయవాడ మీదుగా ఏలూరుకు బయలుదేరింది. అందులో 26 మంది ప్రయాణికులున్నారు. విన్నమాల కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి రోడ్డు పక్కగా ఆగి ఉన్న లారీని వెనుక వైపున ఢీకొంది. దీంతో బస్సు డ్రైవర్ అశోక్‌తో పాటు ఏలూరు ప్రాంతానికి వారు గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ మధు ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మిగిలిన ప్రయాణికులను మరో బస్సులో గమ్యస్థానానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి	రూ. 63
సన్నవి	రూ. 50
పండ్లు	రూ. 25



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	143
లేయర్ (లైవ్)	85
బ్రాయిలర్ చికెన్	252
బ్రాయిలర్ స్కిన్‌లెస్	280
లేయర్ చికెన్	145

